# అమ్మకానికి ఆక్సిజన్

ఆదివారం సాయంత్రం.

మా ఇంటి వెనుక ఉన్న విశాలమైన తోటలో పడక్కుర్చీ వేసుకుని కూచున్నా. ఎటు చూసినా పచ్చదనమే. కళ్ళకు హాయిగా ఉంది. చల్లటి గాలి . . . శరీరం మేఘాల్లో తేలిపోతున్న అనుభూతి . . . పక్షుల కిలకిలా రావాలు . . . వీనులవిందుగా – సంగీతం వింటున్నంత కమ్మగా ఉంది.

నాకు చెట్లంటే ప్రాణం. నా పిల్లల్ని ఎంత శ్రద్ధగా, ప్రేమగా పెంచానో ఈ తోటలోని ప్రతి మొక్కనీ అట్లాగే పెంచాను. పెళ్ళయిన కొత్తలో కొన్న జాగా ఇది. వెయ్యి గజాల స్థలం. వనస్థలిపురంలో స్థలాలు కొనడానికి వెనకాడేవారు ఆ రోజుల్లో. సిటీకి దాదాపు పన్నెండు కిలోమీటర్ల దూరం.

నాకయితే సిటీకి దూరంగా ఉండడమే ఇష్టం. ఎలాగూ పల్లెల్లో ఉండే అదృష్టం లేదాయె. ఉదర పోషణార్థం ఉద్యోగాల వేటలో కాంక్రీట్ కీకారణ్యం లాంటి ఈ సిటీలోకొచ్చి పడ్డాను. ఇక్కడి రద్దీ . . . వాతావరణ కాలుష్యం . . . మనిషికి మనిషి తగులుతున్నంత ఇరుకైన కదలిక . . . నాకు చిరాకు . . . మనుషులూ అంతే . . . మనసులనిండా రద్దీనే . . . తరచూ మెదళ్ళలో ట్రాఫిక్ జాంలు . . . నాకు సిటీ జీవితం సుతరామూ నచ్చదు.

యింట్లో అందరూ వద్దంటున్నా వినకుండా – ధర తక్కువగా ఉందని వెయ్యి గజాల స్థలం కొన్నాను. ఆఫీస్‌లో లోన్ పెట్టి వంద గజాల స్థలంలో రెండు గదులూ, కిచెన్ ఉండేట్టు ఇల్లు కట్టుకున్నాను. నేను కట్టాక చాలామంది ఇళ్ళు కట్టుకున్నారు. ఇప్పుడిది చాలా పెద్ద కాలనీగా ఎదిగింది.

మిగిలిపోయిన తొమ్మిది వందల గజాల ఖాళీ స్థలంలో రకరకాల మొక్కలు నాటాను. ఇప్పుడవి నా కొడుకుల్తోపాటు పెరిగి పెద్దవై మహావృక్షాలుగా మారాయి. అదుగో అటువైపు మామిడి, జామ, నారింజ . . . ఇటువైపు బొప్పాయి, అరటి . . . ఆ మూలన వేప . . . ఇక్కడ కరివేప . . . ఒక వైపంతా పూలమొక్కలు పెంచాను. గులాబీ, మందారం, బంతి,

చామంతి . . . మల్లె, సన్నజాజుల కోసం పందిరి వేయించాను.

ఈ ఇంటికొచ్చాక కూరగాయలు బైట కొనుక్కోవాల్సిన అగత్యం రాలేదు. మా పెరట్లోనే టమేటా, వంకాయ, బెండ, చిక్కుడు, బీర, సొర, పొట్ల, మిరప . . . అలానే బచ్చలి, తోటకూర, గోంగూర, కొత్తిమీర పెంచాం.

ఉదయం పక్షుల కిలకిలా రావాల్తో నిద్ర లేవటం . . . తోటంతా శుభ్రం చేసి, మొక్కలకు నీళ్ళు పోయటం . . . ఆ రోజు వంటకు అవసరమైన కూరగాయలు కోసి శ్రీమతి కివ్వటం . . . సాయంత్రం ఆఫీసు నుండి ఇంటికొచ్చాక మరలా చెట్లకు నీళ్ళు పెట్టి, ఈ చెట్ల కింద కుర్చీ వేసుకుని ఓ గంట విశ్రాంతి తీసుకోవటం నా దినచర్య.

యాభై ఏడేళ్ళ వయసు వచ్చినా మెడిటేషన్, యోగాభ్యాసాల అవసరం నాకెప్పుడూ రాలేదు. మార్నింగ్ వాక్‌లూ, జాగింగ్‌లూ చేయలేదు. రోజుకు రెండు మూడు గంటలు గార్డెనింగ్ చేయటం – ఓ గంట తోటలో కూచుని రిలాక్స్ కావటం . . . అంతే . . . అనారోగ్యం ఎప్పుడూ నా దరిదాపులకు రాలేదు. జీవితం ప్రశాంతంగా గడిచిపోతోంది.

అమెరికా నుండి పెద్దాడు ఫోన్ చేశాడని శ్రీమతి కార్డ్‌లెస్ టెలిఫోన్ తెచ్చి చేతిలో పెడ్తూ "మీతో ఏదో మాట్లాడాలట" అంది.

రెణ్ణిముషాలు వాడితో మాట్లాడాను. వాడూ, బోస్టన్‌లో ఉన్న రెండోవాడు తమ తమ సంసారాల్తో సహా ఉగాది పండక్కి హైద్రాబాద్ వస్తున్నారట. వచ్చే వారాంతానికి ఇక్కడ ఉంటారట. అదీ సారాంశం.

నాకాశ్చర్యమనిపించింది.

నా సుపుత్రులిద్దరికీ ఇండియా రావటం ఇష్టం ఉండదు. అందునా వారికి నా ఇంట్లో దిగటం అస్సలిష్టం ఉండదు. "ఇంత ఇరుకైన ఇంట్లో ఎలా ఉండగలుగుతున్నావమ్మా" అంటూ రెండోవాడు వాళ్ళమ్మ మీద జాలి ఒలకపోశాడట. మొదటివాడి కొడుకైతే "గ్రాండ్‌పాస్ హౌజ్ ఈజ్ నాట్ బిగ్గర్ దెన్ అవర్ బాత్రూం డాడ్!" అన్నాడట. అందుకే వారు రారు.

పెళ్ళిళ్ళయి అమెరికాలో స్థిరపడ్డాక ఒక్కసారి వచ్చారు. అదీ వాళ్ళమ్మ సీరియస్సైతే వచ్చారు. స్టార్ హోటల్స్‌లో రూంలు తీసుకుని, అద్దె కారులో వచ్చి చుట్టపుచూపుగా చూసిపోయారు. ఆ తర్వాత ఇదుగో ఇప్పుడే . . . వస్తున్నట్లు కబురు.

నాకు వాళ్ల రాక రకరకాల ఆలోచనలు రేకెత్తించినా – వాళ్ళమ్మకు మాత్రం సంబరంగా ఉంది. రకరకాల పిండివంటలు వండటంలో ఆమె బిజీ అయిపోయింది.

ఎప్పటికిమల్లె కొడుకులిద్దరూ నక్షత్రాల హోటల్లో సూట్లు తీసుకున్నారు. పది రోజులకు అద్దె కారు మాట్లాడుకున్నారు.

పండగరోజు ఉదయాన్నే వేంచేసి, వాళ్ళమ్మ పెట్టిన ఉగాది పచ్చడి నసుగుతూనే తిన్నారు. ఓ అరగంట ఆ కబుర్లూ, ఈ కబుర్లూ అయినాక వాళ్ల రాకలోని అసలు రహస్యం బైటపెట్టారు.

"నెల క్రితం శేఖర్ నుంచి ఉత్తరం వచ్చిందమ్మా. శేఖర్ నీకు తెల్సుగా. నాతో పాటు ఇంజనీరింగ్ చదివాడూ – ఆ విషయం మాట్లాడిపోదామనే మాకు తీరిక లేకున్నా నేనూ, తమ్ముడు ఇంత దూరం వచ్చాం."

అదేదో వాళ్ళిద్దరికీ ఇష్టం లేకున్నా, బలవంతంగా మా కోసం వచ్చినట్లు ఆరోపణ మిళితమైన వాక్యం వాడాడు పెద్దకొడుకు.

"ఏమని రాశాడ్రా . . . వాడీ మధ్య జూబ్లీహిల్స్‌లో పెద్ద కాంప్లెక్స్ కట్టాడు. మిమ్మల్ని కొనమని అడిగాడా ఏమిటి?" అంది వాళ్ళమ్మ.

"అలాంటిదే అనుకో. వాడికి వనస్థలిపురంలో రెసిడెన్షియల్ ఫ్లాట్స్ కట్టాలని ఎప్పటినుండో కోరిక. సరియైన స్థలం దొరక్క ఇన్నాళ్ళూ పూనుకోలేదట. ఇప్పుడన్నీ సానుకూలపడ్డాయని రాశాడు".

"ఇంకేం? మీరిద్దరూ చెరో ఫ్లాట్ కొనుక్కోండి. మన ఇంటికి దగ్గర . . . పడి ఉంటాయి. వాటి మీద వచ్చే అద్దెలవీ మీ నాన్నగారు వసూలు చేసి మీకు పంపిస్తారు. ఎన్నారైలందరూ హైద్రాబాద్‌లో ఇళ్ళూ, స్థలాలు వేలంవెర్రిగా కొనబట్టే మాయదారి రేట్లు విపరీతంగా పెరిగిపోయాయటగా".

తోటలో కుర్చీ వేసుకుని కూచుని తల్లీ కొడుకుల సంభాషణని జాగ్రత్తగా వింటున్నా.

"అది కాదమ్మా! మన ఇంటి స్థలం ఉంది కదా: తొమ్మిది వందల గజాల స్థలం పూర్కెనే పడి ఉంది. అది వాడికి అమ్మితే కాంప్లెక్స్ కట్టుకుంటాడట. నా ఫ్రెండ్ అయినా తక్కువకి ఇవ్వాల్సిన అవసరం లేదని రాశాడు. మార్కెట్ రేట్ ఎంతుంటే అంత ఇస్తాడట. ఇప్పుడిక్కడ ఐదువేలు నడుస్తుందట కదా. అంటే మనకు నలభై ఐదు లక్షలొస్తాయి."

అదీ వాళ్ళ దుర్మార్గపు ప్లాన్. నాకు విపరీతమైన కోపం వచ్చింది. చెట్ల ఆకులు కదిలి 'శాంతం శాంతం' అన్నట్లనిపించి బలవంతంగా నిగ్రహించుకున్నా. అయినా వాళ్ళడిగినంత మాత్రాన నేను అమ్మాలని లేదుగా. ఈ స్థలం, ఇందులోని మొక్కలూ, చెట్లూ నా ప్రాణం. నేను పోయాక వాళ్ళిష్టం. అప్పటివరకు మార్కండేయుడు శివలింగాన్ని కౌగిలించుకున్నట్లు, నేనీ స్థలాన్ని అంటిపెట్టుకుని ఉంటాను.

"అది సరేరా. వాడంత పెద్ద కాంప్లెక్స్ కడితే దాని ముందు మన వంద గజాల యిల్లు వెలవెలపోదా? మర్రిచెట్టు నీడన తులసిమొక్కలా అసహ్యంగా ఉండదూ?" అంటోంది వాళ్ళమ్మ.

అంటే ఆమెకూ ఇష్టమేనన్మాట. ఎందుకుండదూ? ఇరుకిరుకు గదుల కన్నా లక్షల డబ్బు ముద్దు కదూ. బ్యాంకులో వేసుకుంటే బోల్డంత వడ్డీ. సుఖంగా, దర్జాగా కలర్ టీవీలు, ఫ్రిజ్‌లూ, సోఫాలూ, ఎయిర్‌కండీషన్ రూంలు అనుభవించొచ్చు.

"ఆ విషయం మాకు తెలీదా మమ్మీ. అందుకే శేఖర్‌తో ఓ ఒప్పందానికొచ్చాం. ఈ యిల్లు కూడా అతనికే ఇచ్చేస్తే యాభై లక్షలిచ్చి, హిమాయత్‌నగర్‌లో టూ బెడ్‌రూం ఫ్లాట్ ఇస్తానన్నాడు" అది రెండోవాడి గొంతు.

"మరొకరైతే ఒప్పుకోకపోను. నా క్లాస్మేట్ కాబట్టి ఎలాగోలా ఒప్పించగలిగాను. మనకెంత లాభమో తెలుసా అమ్మా? ఈ ఇంటికి పదిహేను లక్షల ధర పలికినట్లు. నువ్వే ఆలోచించు. బ్యాంక్‌లో యాభై లక్షలు వేసుకుంటే నెలకు నలభైవేల వడ్డీ వస్తుంది. సిటీకి పన్నెండు కిలోమీటర్ల దూరంలో, ఇంత ఇరుకింట్లో ఉండే ఖర్మ తప్పుతుంది" – ఆమె ఆశలకు పెద్దాడు రంగులద్దుతున్నాడు.

"ఇది గోల్డెన్ ఛాన్స్ మమ్మీ. నెలకు నలభైవేల ఆదాయమంటే మీరే పదిమందిని పోషించవచ్చు. హార్ట్ ఆఫ్ ది సిటీలో విశాలమైన ఫ్లాట్‌లో ఉండొచ్చు" రెండోవాడు వూరిస్తున్నాడు.

ఇపుడు మేమేదో వేరే వాళ్ళ పోషణలో ఉన్నట్లు మాట్లాడ్తున్నాడు. వీడు సంపాదనలో పడ్డాక మేము ఒక్క డాలర్ ముట్టుకుంటే ఒట్టు.

"ఇవన్నీ మీ నాన్నగారికి చెప్పండి బాబూ . . . మొదట ఆయన ఒప్పుకోవాలిగా" అందామె.

"యిల్లు ఆడవాళ్ళ కింగ్‌డమ్ మమ్మీ. అందుకే మొదట నీకు చెప్పాం. నీ అంగీకారం అయినాకే నాన్నగారు".

బాగానే కాకా పడ్తున్నాడు రెండోవాడు.

"మొదట నాన్నగార్ని ఒప్పించండర్రా".

వాళ్ళిద్దరూ నా ఎదురుగా వచ్చి నిలబడ్డారు.

చెట్టంత ఎదిగిన కొడుకులు – ఒకటే తేడా . . . వీళ్ళ దగ్గర స్వార్థపు దుర్వాసన వేస్తోంది.

"నాన్నా! విన్నారుగా. చాలా మంచి అవకాశం. ఓన్లీ ఫూల్స్ మాత్రమే ఇలాంటి ఛాన్స్ వదులుకుంటారు".

"నేను ఫూల్‌నే బాబూ. వచ్చిన అవకాశాల్ని వదులుకోవటం తప్ప వాడుకోటం తెలీని వెర్రివాణ్ణి. మీ పెళ్ళిళ్ళప్పుడు మిమ్మల్ని అమ్ముకోవటం చాతకానివాణ్ణి. మీ సంపాదనలోంచి

పైసా రాబట్టుకోలేని వాణ్ణి. నాకు ఆడంబరాల మీద మోజు లేదు బాబూ. నేను బ్రతుకుతున్న ఈ సాదాసీదా బ్రతుకు చాలా హాయిగా ఉంది".

"యాభై లక్షలు బ్యాంకులో వేసుకున్నాక సింపుల్‌గానే బ్రతకండి. మేము కాదంటామా? ఈ ఇల్లూ, స్థలం మాత్రం అమ్మేద్దాం".

"అమ్మేద్దాం అంటూ మిమ్మల్ని కూడా కలిపేసుకుంటున్నారు. ఇది నా స్వార్జితం. అమ్మితే నేను అమ్మాలి. ఆ నిర్ణయం తీసుకోవాల్సింది నేను. ఇప్పుడు చెప్తున్నాను వినండి. ఇందులో గజం స్థలం కూడా అమ్మేది లేదు".

"ఏం? ఎందుకని అమ్మరు?"

పెద్దవాడి గొంతులో కోపం నాకు తెలుస్తూనే ఉంది.

"ఎందుకంటే నేను మిమ్మల్ని అమ్ముకోలేదు కాబట్టి"

"దానికీ దీనికీ ఏమిటి సంబంధం?"

"ప్రేమగా పెంచుకున్న దేన్నైనా అమ్ముకోవటం అమానుషం. నేను మిమ్మల్ని ఎంత ప్రేమగా పెంచానో, ఇక్కడి మొక్కల్ని కూడా అంతే ప్రేమగా పెంచాను. ఈ స్థలం మీద నేను పెంచుకున్న మమకారం మీకు అర్థం కాదు".

"చూడమ్మా! ఈ ముసలాయన ఎట్లా మాట్లాడుతున్నాడో" పెద్దాడు వాళ్ళమ్మ వైపు తిరిగి అన్నాడు.

"చూడు యంగ్‌మాన్! నేనింకా ముసలివాణ్ణి కాలేదు. వయసురీత్యా రిటైర్‌మెంట్‌కి ఇంకో ఏడాది ఉన్నా నేను యంగ్ ఎట్ హార్ట్. మీ మనసులకే ముసలితనం వచ్చింది. తీరని కోరికల్తో, అశాంతితో, అత్యాశల్తో అది ముడతలు పడిపోయింది".

"మేమిక్కడికి కవిత్వం వినడానికి రాలేదు. ఈ స్థలం విషయం తేల్చుకోడానికొచ్చాం."

"తేల్చుకోవడానికి ఏమీ లేదురా అబ్బాయిలూ! ఈ స్థలం నాది. నా సంపాదనతో కొన్నది. దీనిపైన మీకేరకమైన అధికారమూ లేదు. ఇక ఈ విషయాన్ని ఇంతటితో ఆపేయటం మంచిది" చాలా ప్రశాంతంగా చెప్పాను.

అప్పటివరకూ మౌనంగా ఉన్న ఇద్దరు కోడళ్ళూ లంకించుకున్నారు.

"ఇదన్యాయం అత్తయ్యా! మీ పిల్లలకు మీరేమీ ఆస్తులు ఇవ్వలేదు సరే. కనీసం మీ మనవళ్ళకూ, మనవరాళ్ళకైనా ఇవ్వరా?"

"మన పిల్లలిద్దరినీ ఇంజనీరింగ్ చదువులు చదివించాం. అదే మనం వాళ్ళకిచ్చిన అతి విలువైన ఆస్తి. అమెరికాలో వాళ్ళకు కూడు దొరుకుతోంది దాని వల్లనే. ఇక మనవళ్ళూ,

మనవరాళ్ళంటావా – వాళ్ళకివ్వటానికి మన దగ్గర అంతులేనంత ఆప్యాయత ఉంది – అనురాగం ఉంది. అది అమెరికాకు వలసపోయిన వాళ్ళ దగ్గర దొరకదని చెప్పు" అన్నాను నా భార్యను ఉద్దేశించి చెప్తున్నట్లు.

"నా దగ్గరేముందీ బూడిద అన్నట్లు చెప్తున్నారండీ మీ నాన్న . . . ఉన్నదాని గురించేగా అడుగుతోంది. ఈ స్థలం వారిది కాబట్టే దేబిరింపు . . ." అంది పెద్దకోడలు.

"చదివించడమే పెద్ద ఉద్ధరింపులా ఎలా మాట్లాడ్తున్నారో చూడు? మీ బావగారు బాగా చదివి సీట్ తెచ్చుకున్నారు. తన స్వశక్తితో అమెరికాలో ఉద్యోగం తెచ్చుకున్నారు. ఈయనగారేమైనా డొనేషన్లు లక్షలు కట్టారా లేక ఉద్యోగం కోసం లక్షలు లక్షలు లంచాలు పెట్టారా?"

"మీ మరిది విషయమూ అంతే కదక్కా – ఈయనగారు ఏం చేశారని?" అంది రెండో కోడలు.

"నేను వెలగబెట్టిన గుమాస్తాగిరీ ఉద్యోగానికి పిల్లలిద్దర్నీ అంతంత పెద్ద చదువులు చదివించడమే నా శక్తికి మించిన పని. దాన్ని సక్రమంగా నిర్వర్తించినందుకు సంతోషించండి. నాకు చాతనైంది అంతే!"

నా ఇద్దరు కొడుకులూ కస్సుమని లేచారు.

"ఇప్పుడు మేమడుగుతున్నది మీ శక్తికి మించిందీ కాదు – మీకు చాతకానిదీ కాదు. డాక్యుమెంట్లన్నీ మేము రెడీ చేసి తెస్తాం. మీరు చేయవలసిందల్లా సంతకాలు పెట్టటమే" తన అమెరికా తెలివిని ప్రదర్శిస్తున్నాడు రెండోవాడు.

"మీకు శేఖర్ ఇచ్చే ఫ్లాట్‌లో ఫర్నీచర్ అంతా మేమే అరేంజ్ చేస్తాం. మీరూ, అమ్మా ఇక్కడ కారెక్కి, అక్కడ దిగి, మీ అందమైన ఫ్లాట్‌లో హాయిగా ఉండడమే" మొదటి వాడి వూరింపు.

"చూడండి . . . మీరెంతమంది ఎన్ని చెప్పినా ఈ స్థలం అమ్మను. యాభై లక్షలు కాదు కదా యాభై కోట్లయినా నా నిర్ణయంలో మార్పుండదు" అక్కడి నుంచి లేచి లోపలికి వెళ్తూ చివరి తీర్పిచ్చాను.

పండగపూట మధ్యాహ్నం ఎవ్వరూ మెతుకు ముట్టలేదు. వండిన పిండివంటలన్నీ అలానే ఉండిపోయాయి. పిల్లలు ఆకలని ఏడిస్తే కోడళ్ళిద్దరూ రెండు వడ్డించినట్లున్నారు – వాళ్ళు ఏడుపు లంకించుకున్నారు.

ఇంటినిండా విషాద వాతావరణం. నాతో ఎవ్వరూ మాట్లాడడం లేదు. అంతా నిశ్శబ్ద యుద్ధం చేస్తున్నారు. చివరికి నా భార్య కూడా . . .

రాక రాక కొడుకులిద్దరూ తమ సంసారాల్తో సహా వచ్చి నా పొదరిల్లులాంటి ఇంట్లో

వసంతాగమనాన్ని స్ఫురణకు తెస్తారనుకుని సంబరపడ్డాను. ఇప్పుడు వాళ్ళ గుండె చప్పుడు 'నువ్వు దుర్మార్గుడివి' అన్నట్లు వినిపిస్తోంది. వాళ్ళ కళ్ళు నా వైపు 'నువ్వు హృదయంలేని రాయివి' అన్నట్లు చూస్తున్నాయి.

నా పిల్లలిద్దరూ పెరిగి ప్రయోజకులైనారు. కానీ నా పెరట్లోని చెట్లు నోరు లేనివి. వాటి ఆలనాపాలనా చూసుకోవాల్సిన బాధ్యత నా మీదుంది. పిల్లలు సంపాదనాపరులైనాక వారి నుంచి డాలర్‌లో నూరోవంతు కూడా నేనాశించలేదు. కానీ ఈ చెట్లు నేనడక్కుండానే నాకు చల్లని నీడనిస్తున్నాయి. నాకవసరమైన కూరగాయలిస్తున్నాయి. పండ్లిస్తున్నాయి. మంచి గాలినిస్తున్నాయి. అన్నిటినీ మించి నా మనసుకు హాయినిస్తున్నాయి. మరి నా కొడుకులో...

రోజంతా ఇంటి వాతావరణం వేడిగా ఉండింది.

వాళ్ళమ్మకు ఏం నూరిపోశారో ఏమిటో – రాత్రి నాతో దెబ్బలాట పెట్టుకుంది. కొడుకుల మాట వినకపోతే ఉరేసుకుంటానంది. శేఖర్‌గాడిచ్చే ఫ్లాట్‌లో తప్ప ఈ ఇరుకింట్లో క్షణమైనా ఉండనని ఖరాఖండిగా చెప్పింది. నన్నొదిలేసి అమెరికా వెళ్ళిపోతానంది.

పిచ్చిది. అమెరికా వెళ్తే దానికింత ముద్ద కూడా పడేయరన్న సంగతి తెల్సుకోలేక పోతోంది. ముప్పయ్యేళ్ళ కాపురం – అదెంత అమాయకురాలో నాకు తెలుసు. కొడుకులంటే దానికెంత వెర్రి వాత్సల్యమో నాకు తెలుసు.

పండగెళ్ళిన రెండోరోజు వాళ్ళడిగిన కాగితాల మీద సంతకాలు పెట్టాను. నా హృదయం కార్చిన కన్నీళ్ళు ఎవ్వరూ గమనించలేదు.

మాకిచ్చిన ఫ్లాట్‌ని కూడా కలిపి లెక్కేసి యాభై లక్షల్ని మూడు భాగాలు చేసి కొడుకులిద్దరూ చెరో ఇరవై లక్షలు తీసేసుకున్నారు. మా వాటాకొచ్చిన పది లక్షల్లో రెండు లక్షలు ఖర్చు చేసి ఫ్లాట్‌కి అవసరమైన సామగ్రినంతా కొని, మిగిలిన ఎనిమిది లక్షలు బ్యాంక్‌లో వేసి వాళ్ళు అమెరికా వెళ్ళిపోయారు.

వెయ్యి చదరపు అడుగుల ఆ ఫ్లాట్ నాకు జైలు గదిలా అనిపించింది. ఖరీదైన కొత్త ఫర్నీచర్, ఎలక్ట్రానిక్ పరికరాలు చూసి నా భార్య మురిసిపోయింది.

సాయంత్రమయ్యేసరికి పిచ్చి పట్టినట్లయ్యేది. ఎటు చూసినా ఎత్తయిన కాంప్లెక్స్‌లు తప్ప పచ్చని చెట్లు దర్శనమిచ్చేవి కావు.

బస్సెక్కి వనస్థలిపురం వెళ్ళటం – నా ఇంటి ప్రహారీగోడ బైట నిలబడి పొందిగ్గా కట్టుకున్న నా ఇంటినీ, వెనక తోటలో మూగగా రోదిస్తూ నిలబడి ఉన్న చెట్లనీ, మొక్కల్నీ కళ్ళారా చూసుకుని – కదలి కదలి ఏడుస్తున్న నా గుండెని ఎలాగోలా ఓదార్చి – యిల్లనబడే సిమెంటు

గదుల మధ్యకు చేరటం నా దినచర్యగా మారింది.

ఓ రోజు అలవాటు చొప్పున వెళ్ళాను. బైట రెండు లారీలు నిలబెట్టి ఉన్నాయి. వాటి మీద – నేను గుండెల మీద పసిపిల్లల్లా పెంచుకున్న చెట్ల మొండాలు . . . వాటి శరీరాల్ని ఖండఖండాలుగా నరికి . . . మొక్కల్ని ముక్కలు ముక్కలుగా తరిగి . . . కొమ్మల్ని ఏ కండ కాకండ చీల్చినట్లు చీల్చి . . . నా కళ్ళెదురుగానే శవవాహకాల్లా ఆ లారీలు కదిలి పోతుంటే . . . గుండె కలుక్కుమంది. ఛాతీలో సన్నగా మొదలైన నొప్పి . . .

వారం వరకూ అన్నం సయించలేదు. ఏదో గుబులు . . . భరించలేనంత దిగులు . . . గుండెమీద మోయలేనంత బరువు . . . రెండు లారీల్ని నిలబెట్టినట్లు . . .

నాకు ఆత్మీయమైన వాటిని అమ్ముకున్నానన్న గిల్టీ ఫీలింగ్ . . . నన్ను నిలువునా దహిస్తూ, నా అణువణువూ కాల్చేస్తూ . . .

భయపడ్తూనే నా పాత ఇంటివైపు కెళ్ళానా రోజు.

అక్కడ నా ఇల్లు లేదు. అంతా చదునుగా నేల . . .

గుండెల్లో నొప్పి ఎక్కువైంది.

ఇంటికెలా చేరానో తెలీదు. స్పృహ తప్పి పడిపోయాను. పక్క ఫ్లాట్ వాళ్ళ సాయంతో అపోలో ఆసుపత్రిలో చేర్పించిందట నా భార్య.

గుండె నొప్పి తీవ్రంగా వచ్చిందట. మరోసారి ఇలా వస్తే ఏకంగా టపా కట్టేస్తానని చెప్పాడు డాక్టర్. ఓపెన్ హార్ట్ సర్జరీ చేయాలన్నాడు. పిల్లలిద్దరికీ ఫోన్ చేసింది వాళ్ళమ్మ. పనుల ఒత్తిడి వల్ల రాలేకున్నామని చెప్పారట.

వాళ్ళు రారని నాకు తెలుసు. నా దగ్గర మరో వెయ్యి గజాల స్థలం లేదుగా . . .

బ్యాంకులో వేసుకున్న డబ్బుల్లోంచి మూడు లక్షలు ఖర్చు చేసి నా బలహీనమైన గుండెకి రిపేర్ చేయించుకున్నాను.

ఆపరేషన్ అయినప్పటినుంచీ నీరసంగా ఉంటోంది. ఉత్సాహమే ఉండడం లేదు.

ఆక్సిజన్ క్లినిక్ కెళ్ళమని డాక్టర్‌గారు సలహా ఇచ్చారు. ఈ మధ్య నా కొలీగ్ రామనాథం కన్పించి చెప్పాడు. "గంటకు మూడు వందల రూపాయలు . . . స్వచ్ఛమైన ఆక్సిజన్ . . . మన సిటీ మరీ పొల్యూటెడ్ అయిపోయింది . . . ఏం చేస్తాం . . . తప్పదు . . . నాకు బాగానే ఉందనిపించింది. ఓసారి వెళ్ళి చూడు".

మరో వారం తర్వాత సికింద్రాబాద్‌లో ఉన్న ఆరెంజ్ ఆక్సిజన్ క్లినిక్‌కెళ్ళాను. ఆక్సిజన్

మాస్కుని ముక్కుకి తగిలించుకున్నాను. బుస్సుమంటూ ఆక్సిజన్ నా ముక్కుపుటాల దగ్గర వేగంగా వెలువడుతోంది.

కళ్ళు మూసుకుని బలంగా గాలిని లోపలికి పీల్చాను. స్వచ్ఛమైన ఆక్సిజన్ నా వూపిరితిత్తుల్లోకి పాకుతోంది.

సాయంకాలాలు నా తోటలో పడక్కుర్చీ వేసుకుని పడుకున్న జ్ఞాపకం గుండెని కత్తిలా కోస్తూ . . .

ఆక్సిజన్ కొనుక్కోవాల్సి వచ్చిన నా దుస్థితికి కన్నీళ్ళాగలేదు.

నన్ను చూసి, నేను ప్రేమగా పెంచుకున్న చెట్ల ఆత్మలు కూడా మౌనంగా రోదిస్తున్న దృశ్యం . . .

*(రచన ఇంటింటి పత్రిక, మే 2002; కథాపీఠం అవార్డు పొందిన కథ)*